క్లుప్తంగా

పిల్లలతో యాచన చేయించటం చట్టరీత్యా నేరం



సత్తెనపల్లి: పిల్లలతో యాచన చేయించడం చట్ట రీత్యా నేరమని సత్తెనపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీ ప్రమీల అన్నారు. బాలల సంరక్షణలో భాగంగా పట్టణంలోని 16వ వార్డు చెంచు కాలనీలో కమ్యూనిటీ స్థాయిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలన్నారు. తల్లిదండ్రులు పనులకు వెళ్లాలని సూచించారు. బాలల హక్కులను కాలరాయరాదన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం నుంచి ప్రశాంత్, సోషల్ వర్కర్లు జయ రాజ్, నానమ్మ, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

15,663 మందికి పింఛన్లు పంపిణీ



సత్తెనపల్లి: పట్టణం, రూరల్ పరిధిలో మొత్తం 15,663 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేశారు. పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ కమిషనర్ కె.ఆనంద్‌కుమార్ లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. పట్టణ వ్యాప్తంగా 31 వార్డుల్లో 6,149 మంది లబ్ధిదారులకు గాను 5,721 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. 93.04 శాతం పింఛన్ల పంపిణీ జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎన్.సాంబశివరావు, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు. అలాగే సత్తెనపల్లి మండలంలో 10,585 మంది లబ్ధిదారులకు గాను 9,942 మందికి పింఛన్ పంపిణీ చేశారు. 93.93 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు తదితరులు ఉన్నారు.

కృత్యాల ద్వారా విద్యార్థులకు అవగాహన



పెదకూరపాడు: 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దేశ్ అప్నాయెన్ సహయోగ్ ఫౌండేషన్ (డీఏఎస్ఎఫ్) ద్వారా ఆరో తరగతి విద్యార్థులకు ప్రారంభమైన 'యాక్టిజెన్ క్లబ్' శనివారం 'గవర్నమెంట్' అనే థీమ్‌లో మాక్ పంచాయతీ అనే అంశంపై విద్యార్థులతో అనేక కృత్యాలు చేయించారు. ప్రభుత్వానికి సమస్యలను ఎలా విన్నవించుకోవాలి? స్థానిక సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రభుత్వంపై ఎలా ఆధారపడుతున్నామో అనే విషయాలను కృత్యాల ద్వారా విద్యార్థులకు అవగాహన అయ్యేటట్లు చేశారు. సమాజావృద్ధిలో స్థానిక ప్రభుత్వాలు చాలా ముఖ్యమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరెడ్డి, పీఏసీ చైర్మన్ జి.పున్నారావు, ఉపాధ్యాయులు సుగుణావతి, శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

94.28 శాతం పింఛన్లు పంపిణీ

క్రోసూరు: క్రోసూరు మండలంలో 15 సచివాలయాల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం 94.28 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 8,525 మంది లబ్ధిదారులకు గాను రూ.3,69,76,000 మంజూరు అయినట్లు తెలియజేశారు. వాటిలో 8,037 మందికి తొలిరోజు రూ.3,44,30,000 నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు.

ఎన్నికల్లో రిగ్గింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలి

క్రోసూరు: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ ఏజెంట్లపై దాడులు చేసి, రిగ్గింగ్ చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని, రిగ్గింగ్ చేసిన పోలింగ్ బూత్‌లలో రీ పోలింగ్ జరపాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు జి.రవిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పెదకూరపాడు నియోజకవర్గంలో కూటమి నాయకుల అక్రమాలపై ప్రజా సంఘాల నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం గురించి పదే పదే మాట్లాడే కూటమి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రలోభాలు, బెదిరింపులు, దాడులు రిగ్గింగ్‌తో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని ఆరోపించారు. ఎన్నికలను సక్రమంగా నిర్వహించడంలో పోలింగ్ అధికారులు, పోలీసులు విఫలమయ్యారని అన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా కూటమి నాయకులు, కార్యకర్తలు ఓటర్లను, పీడీఎఫ్ ఏజెంట్లను బెదిరించి, హల్‌చల్ చేస్తుంటే పోలీసులు చోద్యం చూసారన్నారు. క్రోసూరులోని 341 బూత్‌లో యథేచ్ఛగా రిగ్గింగ్ చేసారన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ, రైతు, కౌలు కేవీపీఎస్, వ్యవసాయ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దాళ్వా గట్టెక్కేనా..!

- నీటి విడుదలపై వారబందీ అమలు
- చివరి భూములకు అందని నీరు
- ఆందోళనలో అన్నదాతలు

ముప్పాళ్ల: ఖరీఫ్ సాగు నష్టాల నుంచి బయట పడేందుకు చేపట్టిన దాళ్వా సాగుపై వారబందీ అమలు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా ఉంది. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి, వరి అధిక వర్షాలతో తీవ్ర నష్టాలను మిగిల్చాయి. పత్తి రైతులకు కనీసం పెట్టుబడులు కూడా వచ్చిన దాఖలాలు లేవు. వరికి గిట్టుబాటు ధర లేక నష్టాలే మిగిలాయి. అప్పులను పూడ్చుకునేందుకు దాళ్వా సాగు చేపట్టారు. సాగు పూర్తయ్యే వరకు నీటి విడుదలపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టత రాలేదు. సాగర్ జలాశయంలో నీటి లభ్యత అధికంగా ఉందనే ఆశతో రైతులు రెండవ పంట సాగుకు శ్రీకారం చుట్టారు. ఒక పక్క పెరిగిన పెట్టుబడి వ్యయం మరో పక్క ప్రభుత్వం నీటి విడుదలపై వారబందీ ప్రకటించటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. రాత్రి పూట మంచు, పగటి పూట అధిక ఉష్ణోగ్రతలతో పలు రకాల తెగుళ్లు దాడి చేస్తున్నాయి. ఆలస్యంగా నాట్లు పడిన పొలాల్లో ఈ బెడద అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. వ్యయ ప్రయాసాలతో సాగు పూర్తి కావస్తున్న తరుణంలో నీటి విడుదలపై ఆంక్షలు దిగుబడులపై ప్రభావం చూపుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంజన్‌తో నీళ్లు పెట్టుకుంటున్న రైతు

అదనపు భారం

మండలంలో మొత్తం 10 వేల హెక్టార్ల సాగు భూమి ఉంది. ఈ ఏడాది రబీలో 6,700 ఎకరాల్లో పలు రకాల పంటలు సాగు చేశారు. 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2,200 ఎకరాల్లో వరి, 140 ఎకరాల్లో పసుపు, 300 ఎకరాల్లో మిరప పంటలు సాగు చేశారు. మిగిలిన ఎకరాల్లో వాణిజ్య పంటల సాగు చేపట్టారు. మొక్కజొన్న ప్రస్తుతం కండె చివరి దశలో, వరి చిరుపొట్ట దశలో.. మిరప రెండవ కోత దశలో ఉన్నాయి. ఈ తరుణంలో నీరు చాలా అవసరం. ప్రభుత్వం వారబందీ విధించటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నారు. దీంతో ఎకరాకు రూ.10 వేల వరకు అదనపు భారం పడనుంది.



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు పసుపులేటి పెదవీరయ్య. 3 ఎకరాల్లో మొక్కజొన్న, 2 ఎకరాల్లో దాళ్వా వరి, 2 ఎకరాల్లో మిరప సాగు చేశాడు. ముందుగా ఎకరాకు రూ.10 వేలు కౌలు చెల్లించి మిరప సాగు చేశాడు. ఎకరాకు రూ.లక్షన్నర వరకు పెట్టుబడి పెట్టాడు. రెండవ కోత దశలో ఉంది. దాళ్వా వరి సాగుకు రూ.40 వేలు, మొక్కజొన్నకు ఎకరాకు రూ.30 వేల వరకు పెట్టుబడి కాగా, ఆయా పంటలన్నీ చేతికందే దశలో ఉన్నాయి. నీటి విడుదలపై వారబందీ అమలు చేయటంతో పంటలు ఏమవుతాయోనని అయోమయ స్థితిలో ఉన్నాడు. నీరు అందక పోతే దిగుబడులు పూర్తిగా తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నాడు. పెట్టుబడైనా వస్తే చాలు అనుకుంటున్నాడు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే కొంత ఉపశమనం ఉంటుందంటున్నాడు.



చాగంటివారిపాలెం సమీపంలో సాగులో ఉన్న వరి

భయంగా ఉంది



సాగర్‌లో నీరు అధికంగా ఉందని చెబితేనే దాళ్వా వరితో పాటు మొక్కజొన్న సాగు చేశాం. తీరా వారబందీ అని చెబుతున్నారు. ముందే చెబితే సాగు చేసే వాళ్లం కాదు. ఇప్పుడు నీరు రాదంటే చాలా భయంగా ఉంది. పెట్టుబడి వృథా అవుతుంది. గింజ సడలింపు రావాలంటే చివరి తడి చాలా అవసరం. లేకుంటే దిగుబడి తగ్గిపోతుంది. ఆరు తడులుగా నీరు విడుదల చేస్తే చివరి భూములకు నీరు అందదు. మేజర్‌కు దగ్గరగా ఉన్న భూములకే సరిపోతుంది. కాలువలకు నీటి సరఫరా యథావిధిగా విడుదల చేస్తేనే బయటపడతాం.

–పల్లె గోపాలరెడ్డి, రైతు, లంకెలకూరపాడు

నీరు చాలా అవసరం



పంట చిరు పొట్ట దశలో ఉండటంతో నీరు చాలా అవసరం. వారబందీ అమలు చేస్తే నీరు అందదు. నీరు అందకపోతే కంకి తాలుగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టాం. ఈ ఏడాది అన్ని రేట్లు పెరిగిపోయాయి. వారబందీ అమలు చేస్తే నీరు కొనుక్కోవాల్సి వస్తుంది. ఎండ తీవ్రతకు ఎర్రగా మారిపోతుంది. తెగులు గుర్తించే లోపే పొలం అంతా వ్యాపిస్తుంది. ఎన్ని రకాల మందులు వాడినా అదుపులోకి రాదు.

–తుమ్మపూడి గంగరాజు, రైతు, దమ్మాలపాడు

నీటిని పొదుపుగా వాడుకోవాలి



సాగర్ ఆయకట్టు పరిధిలోని కాల్వలకు వారబందీ ప్రకటించడంతో రైతులు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఈ విధానం పాటిస్తే దిగువ భూముల పంటలకు నీరు అందుతుంది. ప్రస్తుతం మొక్కజొన్న చివరి దశలో ఉంది. వరి సాగు చేసిన రైతులు నీటిని వృథా చేయకుండా ఉంటే సరిపోతుంది.

–ఎం.అరుణ, ఏవో, ముప్పాళ్ళ

ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా కాశయ్య బాధ్యతల స్వీకరణ



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నకరికల్లు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న జి.కాశయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన పీజే విలియమ్స్ శుక్రవారం పదవీ విరమణ కావటంతో ఉన్నతాధికారులు నకరికల్లు ఎంపీడీవోకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేర కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈఓపీఆర్డీ రూపవతి, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది ఇన్‌చార్జ్ ఎంపీడీవోను పుష్ప గుచ్ఛం అందించి సన్మానించారు.

పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం



నకరికల్లు/ క్రోసూరు: ముస్లింలు పవిత్రంగా భావించి నెలరోజుల పాటు కఠోర ఉపవాస దీక్ష పాటించే రంజాన్ మాసం శనివారంతో ప్రారంభమైంది. శనివారం రాత్రి చంద్రవంక దర్శనమివ్వడంతో తరావీహ్ నమాజును ముస్లిం సోదరులు పఠించారు. రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రారంభించాలని మత పెద్దలు ప్రకటించారు. నెలవంక కనబడినట్లు మత పెద్దలు ధ్రువీకరించారు. రంజాన్ మాసంలో ఖురాన్ ఆదేశాల మేరకు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు, ఐదు పూటల నమాజు చేయాలన్నారు. అదేవిధంగా ఇస్లాం ప్రకారం ఈ మాసంలో ఇతరులను దూషించడం, అబద్ధాలు ఆడటం, దుర్మార్గపు పనులు పూర్తిగా నిషేధమని, దానాలు, ధర్మాలు, పేదల పట్ల దయ, జాలి, కరుణ కలిగి ఉండటమే రంజాన్ మాసం ముస్లింల పట్ల బాధ్యతను తెలియచేస్తుందన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం నిర్వహించాలి

డీఎల్‌పీఓ ఎం.విజయాభాస్కర్‌రెడ్డి

నకరికల్లు: ఇంటింటి నుంచి చెత్త సేకరించే కార్యక్రమం నూరు శాతం నిర్వహించాలని డీఎల్‌పీఓ ఎం.విజయాభాస్కర్‌రెడ్డి సూచించారు. నకరికల్లులో తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటించి గ్రీన్ అంబాసిడర్‌లు చెత్త సేకరిస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. డంపింగ్ యార్డులలో సేంద్రియ ఎరువు తయారీకి వ్యర్థాలను వినియోగించాలని సూచించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్‌లు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చెత్తను సేకరించే సమయంలో, చెత్త సేకరించిన అనంతరం ప్రభుత్వం ద్వారా పంపిణీ చేసిన గ్లౌజులు, మాస్క్‌లు, సబ్బులు వినియోగించాలని సూచించారు. అడ్డరోడ్డు గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, అడ్డరోడ్డు పంచాయతీ కార్యదర్శి కల్యాణ్, గ్రీన్ అంబాసిడర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ విజయాభాస్కర్‌రెడ్డి, ఈఓపీఆర్డీ శివప్రసాద్

పట్టాతో వెళ్లిన విద్యార్థుల జీవితం సార్థకత

సత్తెనపల్లి: క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకుని మంచి ఉత్తీర్ణత సాధించి పట్టా చేతిలో పట్టుకుని బయటకు వెళ్లిన విద్యార్థుల జీవితం సార్థకత అవుతుందని హైకోర్టు న్యాయవాది కన్నా మోహర్ రజని అన్నారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల లయోలా ఇంజనీరింగ్ కళాశాల 24వ వార్షిక వేడుకలు శుక్ర, శనివారాల్లో కళాశాల ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టా లేకుండా బయటకు వెళ్లిన విద్యార్థుల జీవితం వ్యర్థమవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్చుకొని బయటకు వెళ్లాలని సూచించారు. మరో ముఖ్య అతిథి ఫాదర్ లూర్ధ్ రెడ్డి మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా చదువుకున్న విద్యార్థులు గొప్పవారవుతారన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌లో నేడు ప్రపంచంలోని దేశాలన్నీ పోటీ పడుతున్నాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల డైరెక్టర్ వంశీకృష్ణ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌కి పునాది వేసుకోవాలనుకునే విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని అదుపు చేయకపోతే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేరని హెచ్చరించారు. 2024–25 విద్యా సంవత్సరంలో అన్ని విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించి, మెమెంటోలను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ శివారెడ్డి, కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది కన్నా మోహర్ రజని

స్నేహ హస్తాలు సౌజన్యంతో పాఠశాలకు ఫెన్సింగ్

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి పశువులు, అసాంఘిక శక్తులు ప్రవేశించకుండా ఉండేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తుల సంయుక్త సహకారంతో పాఠశాల చుట్టూ నిర్మించిన ఫెన్సింగ్‌ను ఎంఈవో మాచవరపు గణేశ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పశువులు ప్రవేశించడంతో ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా ఉండటం వల్ల విద్యార్థులు చదువుపై ఏకాగ్రత పెట్టలేని పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. విషయం తెలుసుకున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్, గ్రామస్తులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామని ముందుకు రావడం అభినందనీయమన్నారు. దీనికి మొత్తం రూ.1.20 లక్షలు ఖర్చు కాగా, రూ.60 వేలు స్నేహ హస్తాలు, రూ.60 వేలు గ్రామస్తులు భరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అచ్చంపేట స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ చిగురుపాటి కళ్యాణి, సర్పంచ్ రామావతు కోటేశ్వరనాయక్, ఎస్ఎంసీ చైర్మన్ కొట్టె నరేష్, హెచ్ఎం నంద్యాల శివకుమారి, స్నేహ హస్తాలు కో ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు, సభ్యులు తుమ్మా శౌర్రెడ్డి, ఉపాధ్యాయులు బత్తుల సాంబశివరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఫెన్సింగ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో గణేష్

కనుల పండువగా సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణం

అచ్చంపేట: మండలంలోని మాదిపాడు పంచాయతీ పరిధిలోని అడవిలో స్వయంభు సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీలక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహించారు. గత 41 రోజులుగా అమ్మవారి దీక్ష చేపట్టిన భక్తులు మాల విరమణ కార్యక్రమన్ని చేపట్టారు. యర్రంశెట్టి శ్రీనివాసరావు, సత్యవతి దంపతులు 108 మట్టి కలశాలతో సత్తెమ్మతల్లి, సత్యదేవుల ఉత్సవ మూర్తులకు పాలాభిషేకం చేశారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని యర్రంశెట్టి శ్రీనివాసరావు దంపతులచే మేడేపల్లి అప్పయ్యశాస్త్రి శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు, కోలాట ప్రదర్శనలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్తెమ్మతల్లి, సత్యదేవుల కల్యాణాన్ని తిలకించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



సత్తెమ్మతల్లికి చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మున్సిపల్ రోడ్డు స్థలంలో ఇంటి నిర్మాణానికి చదును



సత్తెనపల్లి: పట్టణంలో 3వ వార్డులో పాత సుగాలి కాలనీలో బుల్లా గంటయ్య ఇంటి పక్కన మున్సిపాలిటీ రోడ్డు మీద కొంత మంది దుండగులు ఆ రోడ్డును చదును చేసి ఇంటి నిర్మాణం చేపట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు ఆరోపించారు. అడ్డుకునేందుకు ప్రయత్నించగా అది తాము రిజిస్ట్రేషన్ చేయించుకున్నామని, కనుకనే ఇల్లు వేస్తున్నామని సమాధానం చెబుతున్నారన్నారు. అది రోడ్డు కదా మీకు ఎలా రిజిస్ట్రేషన్ చేశారు అని అడగగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారన్నారు. రోడ్డు స్థలం ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి ఆ నిర్మాణాన్ని నిలిపివేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు అతిక్రమించవద్దు

ఎస్ఐ నాగేంద్రరావు

క్రోసూరు: నూతన మోటారు వాహన చట్టం ప్రకారం వాహనదారులు నిబంధనలు అతిక్రమించవద్దని.. అతిక్రమించితే జరిమానాలు ఈ విధంగా ఉంటాయని ఎస్ఐ నాగేంద్రరరావు శనివారం తెలిపారు. హెల్మెట్ లేకుంటే రూ.1000, మూడు సార్లు పట్టుబడితే లైసెన్సు రద్దు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే రూ.10 వేలు జరిమానా ఆరు నెలల జైలు లేదా రెండూ అని తెలిపారు. అదేవిధంగా సీటు బెల్ట్ పెట్టుకోకపోతే రూ.1000, లైసెన్సు లేని డ్రైవింగ్‌కు రూ.5 వేలు, రాంగ్ రూట్‌లో నడిపితే రూ.5 వేలు, అధిక వేగం రూ.1,000–2,000, ప్రమాదకర డ్రైవింగ్‌కు రూ.5 వేలు, అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకపోతే రూ.10 వేలు, బీమా లేకుంటే రూ.2 వేలు, పర్మిట్ లేని వాహనాలకు రూ.10 వేలు, త్రిపుల్ డ్రైవింగ్‌కు రూ.5 వేలు, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు రూ.5 వేలు, మైనర్ డ్రైవింగ్ చేస్తే సంరక్షకులు లేదా యజమానికి మూడు సంవత్సరాల జైలు రూ.25 వేలు జరిమానా విధించటం జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలు ఈ విషయాలన్నీ దృష్టిలో పెట్టుకుని వాహనాలు నడిపేటప్పుడు అన్ని ధ్రువ పత్రాలు దగ్గర పెట్టుకోవాలని కోరారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

నకరికల్లు: వేసవి కాలం దృష్ట్యా మండలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా ఆదేశించారు. నకరికల్లులో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. పలువురు లబ్ధిదారులకు పింఛన్‌ను స్వయంగా అందజేశారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి ఎద్దడి ఉండే గ్రామాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏ గ్రామంలోను తాగునీటి సమస్య రాకూడదన్నారు. ముందుగా గ్రామాల్లో పర్యటించి బోర్లు, రక్షిత మంచి నీటి కొళాయిలు పరిశీలించాలని, మరమ్మతులకు గురైన చోట వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీరాజ్ ఏఈ సురేష్, సీసీ కనకారావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమీక్షలో డీఆర్‌డీఏ పీడీ హీరాలాల్ సామారియా

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ఉరుకుల పరుగుల మధ్య ప్రారంభమయ్యాయి. పట్టణంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను, ఒక్కో పరీక్ష కేంద్రంలో 300 మంది విద్యార్థులు పరీక్ష రాసేలా ఏర్పాటు చేశారు. కాగా శాంతినికేతన్ జూనియర్ కళాశాల గతంలో వాల్మీకి నగర్ సమీపంలో కాకతీయ కల్యాణ మండపం ఎదురుగా ఉండేది. ఆ కళాశాలను రఘురాంనగర్‌లోని ఆర్సీఎం పాఠశాలలోకి షిఫ్ట్ చేశారు. అయితే హాల్‌టికెట్‌పై పాత అడ్రస్ ఉండడంతో విద్యార్థులు కొంత అయోమయానికి గురయ్యారు. కళాశాల నిర్వాహకులు మాత్రం పాత కళాశాల వద్ద ప్రత్యేకంగా అధ్యాపకులను, అడ్రస్ తెలిసేలా ఫ్లెక్సీ కూడా పెట్టారు. ఇద్దరు, ముగ్గురు విద్యార్థులు అయోమయానికి గురికావడంతో విషయం తెలుసుకున్న డీఐఈఓ లీలావతిదేవి శాంతినికేతన్ జూనియర్ కళాశాలను సందర్శించి చీఫ్ సూపరింటెండెంట్ ప్రభుదాస్‌తో మాట్లాడారు. ఈ కేంద్రంలో మొత్తం 262 మందికి గాను 21 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

బెల్లంకొండ: ఇంటర్మీడియెట్ పరీక్షలు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్ కె.కవిత తెలిపారు. కాగా తెలుగు పరీక్షకు 8 మంది, హిందీకి ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. పరీక్షలను స్థానిక తహసీల్దార్ షేక్ అఫ్రపున్నీసా బేగం తనిఖీ చేశారు. పరీక్షలను పక్కాగా నిర్వహించాలని సూచించారు. డిపార్ట్‌మెంటల్ అధికారి కె.రమేష్ బాబు పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రానికి ఎస్ఐ డి.ప్రవీణ్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

అచ్చంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన తెలుగు పరీక్షకు మొత్తం 353 మంది విద్యార్థులకు గాను 347 మంది హాజరయ్యారు. మొదటి, రెండవ సంవత్సరం ఇంటర్ పరీక్షలు రోజు మార్చి రోజు జరుగుతాయని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బాలకాశీనాయక్ తెలిపారు.



కళాశాల గేట్‌కు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కనుల పండువగా కపోతేశ్వరస్వామి కల్యాణం

నకరికల్లు: మండలంలోని చేజర్ల గ్రామంలో వేంచేసిన గంగా భ్రమరాంబ పార్వతీ సమేత కపోతేశ్వరస్వామి వారి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణం శనివారం తెల్లవారుజామున కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలోని మండపంలో విశేషంగా అలంకరించిన స్వామి వార్ల ఉత్సవ మూర్తులు కొలువుదీరగా బ్రహ్మశ్రీ కపోతేశ్వరశాస్త్రి, ఆలయ అర్చకులు కొండ వెంకట్రామయ్యశర్మల ఆధ్వర్యంలో కల్యాణ వేడుక శాస్త్రోక్తంగా జరిపించారు. కల్యాణోత్సవానికి ముందుగా బలిహరణ, స్వామి వారి ఊరేగింపు, ఎదురుకోల తదితర కార్యక్రమాలు వైభవంగా జరిపించారు. రథోత్సవం, రథాంగ బలిహరణ పూజాదికాలు నిర్వహించారు.

తిరునాళ్లలో డాక్టర్ గజ్జల

చేజర్ల గ్రామంలో కపోతేశ్వరస్వామి తిరునాళ్ల వేడుకల్లో సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్మించిన విద్యుత్ ప్రభ పైకి వచ్చి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడి ఉత్సాహపరిచారు. ఆయన వెంట సత్తెనపల్లి నియోజకవర్గ పరిశీలకులు పడాల శివారెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి

హనుమాన్ చాలీసా పారాయణం



గోళ్ళపాడు (ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం శనివారం నిర్వహించారు. ఆలయంలో తెల్లవారుజామున జరిగిన ఈ కార్యక్రమంలో హనుమద్దీక్షాపరులు పాల్గొని 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.